# నామాలపాడుకు ఎగనామం

- పైలట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిరాశ
- ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు114 మందికి ..
- ఇండ్ల మంజూరు26 మందికి మాత్రమే ..
- పేద గిరిజనుల ఆవేదన
- ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి

బయ్యారం, ఏప్రిల్ 20 : పైలట్ గ్రామమైన నామాలపాడులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ఇదిగో ఇల్లు.. అదిగో ఇల్లు అంటూ సంవత్సరన్నర నుంచి సాగదీస్తూ వచ్చిన సర్కారు ఇటీవల పైలట్ గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేవు. సంతోషంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని రకాలుగా సిద్ధమయ్యారు. కానీ, వారి ఆనందం ఎంతోసేపు నిలువలేదు. ఇలా ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ఇచ్చి..అలా తీసేసుకున్నారు.మీకు ఇంకా ఇల్లు మంజూరు కా లేదు.. కొందరికే మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నామాలపాడు గ్రామ పంచాయతీని పైలట్ గ్రామంగా అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో గత నెల 26న ఎమ్మెల్యే కోరం కనకయ్య ధర్మపురం గ్రామంలో 40 మందికి, రాయికుంటలో 32 మందికి, నామాలపాడులో 42 మందికి మొత్తం 114 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అర్హులకు నూరుశాతం ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అయితే, ఇచ్చిన పది రోజులకే జీపీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి మంజూరు పత్రాల్లో సంతకాలు పెట్టించి మళ్లీ ఇస్తామని చెప్పి లబ్ధిదారుల నుంచి వెనక్కి తీసుకున్నారు. ఈ క్రమంలో కొందరు పత్రాలు వెనక్కి ఇవ్వగా, మరికొందరు ఇచ్చేందుకు నిరాకరించారు. అనంతరం గ్రామంలో మరోమారు సర్వే చేసిన అధికారులు ఇటీవల నామాలపాడులో ఇద్దరికి, రాయికుంటలో 5 గురికి, ధర్మపురం గ్రామంలో 19 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పి ఇటీవల ముగ్గు పోశారు. అయితే, ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్న మిగతా లబ్ధిదారులు అధికారుల వద్దకు వెళ్లి, మేం కూడా ఇల్లు కట్టుకుంటామని అడిగితే.., మీకు ఇంకా ఇల్లు మంజూరు కాలేదని.. మీరు అర్హులు కాదని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇల్లు మంజూరైందనే ఆశతో కొందరు ఉన్న ఇంటిని కూలగొట్టుకున్నారు. మరికొందరు ఇంటి నిర్మాణానికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో ఇల్లు మంజూరు కాలేదని చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ఇల్లు వస్తుందో.. రాదోనని పరేషాన్ అవుతున్నారు. ఇల్లు వచ్చిందని ఆశపడితే నిరాశే ఎదురైందని, పత్రాలు ఇచ్చి ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రాలు ఇచ్చిన అందరికీ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా.. 26 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, మరో 24 మందికి త్వరలో మంజూరవుతాయని తెలిపారు. కొందరికి గతంలో ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్‌లు వచ్చినట్లుగా సర్వేలో గుర్తించినట్లు తెలిపారు.


నామాలపాడులో మంజూరు పత్రాలను చూపుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

### అన్నం పెట్టి.. కంచం గుంజుకున్నరు..



ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని మంజూరు పత్రం అందించారు. మాకు ఇల్లు మంజూరైంది.. మేం ఇల్లు కట్టుకుంటున్నామని చుట్ట పక్కళ్లకు.. సుట్టాల గొప్పగా చెప్పుకున్నాం.. తీరా ఇప్పుడు ఇచ్చిన పత్రం వెనక్కి తీసుకొని మీకు ఇంకా ఇల్లు మంజూరు కాలేదని అధికారులు సావు కబురు సల్లాగా చెబుతున్నారు. ఇప్పుడు మేము ఏం చేయాలి.. పేదోళ్లకు ఇల్లు ఎందుకు మంజూరు చెయ్యరు.. కంచంలో అన్నం పెట్టి గుంజుకున్నరు..

– జీ సుగుణ (నామాలపాడు)

### పాత ఇల్లు కూల్చి, కొత్త ఇంటికి సిద్ధమయ్యాం..



ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు మంజూరు పత్రం ఇచ్చారు. ఉన్న పాత ఇంటికి తీసి అక్కడే కొత్త ఇల్లు కట్టుకుందామనుకున్నాం. పాత ఇంటి పెంకులు తొలగించాం. ఇంతలో ఇల్లు మంజూరు కాలేదని అధికారులు చెప్పడంతో సగం తీసి ఆపి వేశాం. ప్రస్తుతం అత్తింట్లో ఉంటున్నాం. ఇల్లు వచ్చిందని ఎంతో సంతోషపడ్డాం. తీరా, రాలేదని చెప్పడంతో నిరాశ చెందాం. మంజూరు పత్రం ఇచ్చి ప్రభుత్వం మోసం చేసింది.

– జీ మహేశ్వరి (నామాలపాడు)

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

కేసముద్రం, ఏప్రిల్ 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. మే డేను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివారం మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, ధరావత్ వీరన్న, సామ శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కురవి, ఏప్రిల్20: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కొత్తూరు(జీ) వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లందు మండలం మడంపల్లి గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి బైక్‌పై మహబూబాబాద్‌లోని ఓ వివాహ వేడుకకు హాజరై, ఇల్లందు వైపు బైక్‌పై వెళ్తుండగా, అదుపు తప్పి కొత్తూరు(జీ)–పెద్దతండా మద్య భద్రాచలం ప్రధాన రహదారి పక్కన గుంతలో పడిపోయాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు.


శ్రీరామగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

## రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

### ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

నెల్లికుదురు, ఏప్రిల్ 20 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం ఆయన మండలంలోని శ్రీరామగిరి, ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయా సొసైటీల చైర్మన్లు గుండా వెంకన్న, దేవేందర్‌రావులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం చైర్మన్ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యం అమ్మి ఆర్థికంగా మోసపోవద్దనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఎప్పటికప్పుడు కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించాలన్నారు. టార్పాలిన్లు, గన్నీ సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండా వెంకన్న, ఎర్రబెల్లిగూడెం సొసైటీ చైర్మెన్ దేవేందర్‌రావు, నాయిని సత్యపాల్‌రెడ్డి, గొల్లపల్లి ప్రభాకర్, పట్నంశెట్టి నాగరాజు, ఆకుతోట సతీశ్, వంశీ, మౌనేందర్, తూళ్ల నరేందర్, డైరెక్టర్లు, సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం

తొర్రూరు, ఏప్రిల్ 20 : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కందిమల్ల రమేశ్ గుప్తా కూతురు రూప వివాహం ఆదివారం తొర్రూరులోని రామ ఉపేంద్ర గార్డెన్‌లో జరగగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం అమ్మాపురం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి కూతురు వివాహం మణికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరుగగా, ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాకారి రవిరాథోడ్

## వైద్యశాలలో తనిఖీలు

మరిపెడ, ఏప్రిల్ 20 : మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్ ఆదివారం తనిఖీ చేశారు. వైద్యశాల పరిసరాలు, ఫార్మసీ స్టోర్, వ్యాక్సినేషన్ రూమ్, అటెండెన్స్ రిజిస్టర్, తదితర రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవిలో మందుల కొరత లేకుండా చూడాలని, వడదెబ్బతో వచ్చిన వారికి వెంటనే ప్రథమ చికిత్స చేసి జిల్లా వైద్యశాలకు రెఫర్ చేయలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ చైతన్య, ఫిరోజ్, వీరన్న పాల్గొన్నారు.

# వృత్తి విద్యతో ఉపాధి మెరుగు

### రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవై నాయక్..

తొర్రూరు, ఏప్రిల్ 20 : నేటి పరిస్థితులకు అనుగుణంగా యువత వృత్తి విద్య కోర్సులు నేర్చుకోవాలని, వాటితోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవై నాయక్ అన్నారు. మండల శివారు వెలికట్ట గ్రామ పరిధిలోని పాలకేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారద ఐటీఐ కళాశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐటీఐ చదివిన వారికి దశ మారడంతోపాటు నూతన కోర్సులు పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధి లక్ష్యంగా రూపొందించిన నూతన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంప్రదాయ కోర్సుల స్థానంలో వృత్తి విద్య కోర్సులు చదివితే ఎవరి కాళ్లపై వారు నిలబడే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బాబు, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, పట్టణ అధ్యక్షుడు బిందూశ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ టికు నాయక్, నాయకులు దామోదర్‌రెడ్డి, రామచంద్రనాయక్, సురేశ్, రాజారాం, తుకారం, హేమానాయక్, తదితరులు పాల్గొన్నారు.


రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నాయక్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

## ఉపాధ్యాయుల గొంతుకై నిలబడతా..

### ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్,ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల గొంతుకై నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం పీఆర్టీ యూ మానుకోట జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సంకా భద్రీనారాయణ, గీత, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

## మోత్కూరులో రోడ్డు ప్రమాదం

### నిధానపురం వాసి మృతి

దంతాలపల్లి, ఏప్రిల్ 20 : భువనగిరి యాదాద్రి జిల్లా మోత్కూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంతాలపల్లి మండలం నిధానపురం గ్రామవాసి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం నిధానపురం గ్రామానికి చెందిన కాగు వెంకన్న–పద్మ దంపతుల చిన్న కొడుకు కాగు గణేశ్ (21) పరీక్షలు పూర్తి కావడంతో హైదరాబాద్‌లో కూలి పని చేసేందుకు తన బంధువుతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. మోత్కూరు వద్ద బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టడంతో గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువు సంపత్‌కు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. గణేశ్ మృతితో నిధానపురం గ్రామంలో విషాయఛాయలు అలుముకున్నాయి.


గణేశ్(ఫైల్)


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

## బాధిత కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

చిన్నగూడూరు, ఏప్రిల్ 20 : బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ముత్యం వెంకన్న తండ్రి ముత్యం భిక్షం అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు ఉగ్గంపల్లిలో పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాలోత్ కవిత, శంకర్‌నాయక్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

## మహిళ అదృశ్యం

తొర్రూరు : మహిళ అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలం జగన్నాథపల్లి గ్రామానికి చెందిన అన్నబోయిన రేణుక కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో బాధపడుతున్నది. ఈ క్రమంలో ఏప్రిల్ 4న తల్లి ఊరైన వెలికట్టె గ్రామానికి చెందిన కనుకుంట్ల సోమయ్య ఇంటికి వచ్చింది. అయితే, శనివారం అర్ధరాత్రి రేణుక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. ఆదివారం తండ్రి సోమయ్య తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న రెడ్యానాయక్

## వధూవరులకు రెడ్యా ఆశీర్వాదం

డోర్నకల్ : రావిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ధనియాకుల వెంకటేశ్వర్లు, అచ్చమ్మ కుమారుడు సాయిప్రసాద్– శ్రీనవ్య వివాహం స్థానికంగా జరుగగా, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నంజ్యాల మధు, వీరయ్య, రేపాకుల కృష్ణ, సతీశ్ పాల్గొన్నారు.



చిన్నకిష్టాపురంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు సక్రు

## గిరిజనులపై దాడులు ఆరికట్టాలి

గార్ల : ఆదివాసీ గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడులను ఆరికట్టాలని ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జీ సక్రు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న కిష్టాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గ్రామంలోని ఆదివాసీలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపినట్లు తెలిపారు. ఈ కాల్పులల్లో వందలాది మంది ఆదివాసీ ప్రజలు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, కిషన్, రాంబాయి, కౌసల్య, సతీశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.

NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## సవారు లచ్చమ్మకు బోనాలు

దంతాలపల్లి, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు ఆదివారం సవారు లచ్చమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులుగా సవారు లచ్చమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటున్న కాలనీ వాసులు ఆదివారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, తల్లికి నైవేద్యంగా బోనాలు సమర్పించారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొన్నది.


సవారు లచ్చమ్మకు బోనాలు చెల్లిస్తున్న మహిళలు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

చిన్నగూడూరు, ఏప్రిల్ 20 : మండల కేంద్రలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–2006 పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సోమనర్సయ్య, సోమయ్య, ఉమారాణి, మాధవాచారి, ప్రసాద్, శంకర్, నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వర్, పూర్వ విద్యార్థులు మహేశ్, విజయ్, సురేశ్, సతీశ్, నరేశ్, జీవన్, సోమన్న, హేమంత్, సుధాకర్, స్వాతి, పాల్గొన్నారు.

# వేతన వెతలు..

- ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా అందని జీతాలు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

డోర్నకల్, ఏప్రిల్ 20 : గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో మొత్తం 242 మంది పని చేస్తుండగా, 2006 సంవత్సరం నుంచి 20 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలకు అందుబాటులో ఉంటున్నారు. కేవలం ఉపాధి పనులనే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలును ఫీల్డ్ అసిస్టెంట్స్ బాధ్యతగా తీసుకొని పని చేస్తున్నారు. కానీ, వీరి సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదు. చాలీచాలని వేతనంతో ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బంది పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.8500 నుంచి రూ. పది వేలకు వేతనం పెంచింది. తర్వాత 30 శాతం అలవెన్స్ కలిపి రూ.12,000 చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను పట్టించుకోవడం లేదు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ డిమాండ్ చేస్తున్నారు.


సీతంపేటలో ఉపాధి కూలీల హాజరు నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

### పెండింగ్ వేతనాలు తక్షణమే ఇవ్వాలి..

ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలు వేతనాలు తక్షణమే ఇవ్వాలి. కనీస వేతనం రూ. 25 వేలుకు పెంచాలి. 30 శాతం సమ్మర్ అలివెన్స్ ఇవ్వాలి. ఉపాధి కూలీలకు పనివద్ద మెడికల్ కిట్లు, నీడకు టెంట్, తాగునీరు ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య


భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గిరిజనులు

## ఘనంగా భోగ్ బండారో

మరిపెడ, ఏప్రిల్ 20 : సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన భోగ్ బండారో కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ మండలాల గిరిజనులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రాఘురాంరెడ్డి పాల్గొన్నారు. బంజార సంస్కృతి, ధర్మాన్ని రక్షించడం కోసం, బంజారాల ఐకమత్యం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.